

ఏర్పాట్లు పూర్తి



- కర్నూలులో కీలక అధికారులు, నేతల మకాం
- ప్రధాని పర్యటనపై సమీక్షలు
- విజయవంతం చేసేందుకు సమాలోచనలు
- రేపు శ్రీశైలం, కర్నూలుకు రానున్న ప్రధాని మోదీ
- కర్నూలులో భారీ బహిరంగ సభ

కర్నూలు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ గురువారం కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనకు సంబంధించి అధికారులు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. వేదికతో పాటు అన్ని రకాల పనులను పూర్తి చేసి మంగళవారం సాయంత్రానికి కేంద్రబలగాలకు వేదికను అప్పగించారు. ఎస్పీజీ బృందం మరోసారి వేదికతో పాటు, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించింది. బుధవారం కేంద్ర అధికారులు, బలగాలు, ప్రధాని భద్రతాసిబ్బంది పర్యవేక్షణలో మరోసారి పరిశీలన జరగనుంది.

గురువారం ఉదయం ఢిల్లీ నుంచి ఓర్వకల్లు విమానాశ్రయం చేరుకొని అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో శ్రీశైలం చేరుకుంటారు. శ్రీశైలం చేరుకుని జ్యోతిర్లింగం, శక్తిపీఠం క్షేత్రాలను దర్శించుకుంటారు. మల్లికార్జునస్వామి, భ్రమరాంబికదేవిలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం ప్రత్యేక హెలికాప్టర్‌లో కర్నూలు నగర శివారున ఓర్వకల్లు మండలం నన్నూరు టోల్ ప్లాజా దగ్గర రాగమయూరి గ్రీన్‌హిల్స్‌లో నిర్వహించనున్న జీఎస్టీ-2.0 సంస్కరణలు, ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించే 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' భారీ బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొంటారు.

మిగతా 6వ పేజీలో

ఇబ్బందుల్లేకుండా జయప్రదం చేయాలి

- ఏర్పాట్లపై మంత్రుల సమీక్ష



ప్రధానమంత్రి ఏర్పాట్లపై చర్చిస్తున్న వివిధ శాఖల మంత్రులు

ఓర్వకల్లు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ప్రధాని సభను జయప్రదం చేయాలని మంత్రులు అన్నారు. మంగళవారం నన్నూరు రాగమయూరి గ్రీన్‌హిల్స్ వద్ద కమాండ్ కంట్రోల్‌రూమ్‌లో ఏర్పాట్లపై మంత్రులు చర్చించారు. వ్యవసాయశాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ వైద్య విద్యాశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వర రావు యాదవ్ ఏర్పాట్లపై సమీక్షించారు. బహిరంగ సభకు వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా వాహనాలు సమకూర్చాలని, భోజనం, నీటి వసతి సకాలంలో అందించాలన్నారు. భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని, ప్రధానితో పాటు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు, ఎంపీలు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కానున్నారన్నారు.



శ్రీశైలంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, ఇతర సీనియర్ ఐపీఎస్ అధికారులు







ముమ్మర ఏర్పాట్లు

- 1500 మరుగుదొడ్లు..
- నిరంతరం శ్రమిస్తున్న 200 మంది కార్మికులు
- పర్యవేక్షిస్తున్న 100 మంది అధికారులు, ఉద్యోగులు



సభ పరిసరాల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్లు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఈ నెల 16న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా సభా ప్రాంగణంలో నగరపాలక అధికారులు, సిబ్బంది ముమ్మరంగా ఏర్పాటు చేస్తున్నారు. రహదారుల మరమ్మతులు, పార్కింగ్ ప్రదేశాలు, సైన్ బోర్డులు, దీపాల ఏర్పాటు, పారిశుధ్య చర్యలు, మొబైల్ టాయిలెట్లు, హెల్ప్ డెస్క్ ఏర్పాట్లపై పూర్తిస్థాయి చర్యలు తీసుకున్నారు. ఇతర నగరాల నుంచి వచ్చే మున్సిపల్ ఉన్నతాధికారులు, కమిషనర్లు, పారిశుధ్య సిబ్బంది ఇబ్బందులు పడకుండా వసతి, ఆహారం, రవాణా వంటి సౌకర్యాలు సమకూర్చారు. సభా ప్రాంగణంలో సుమారు 1,500 మరుగుదొడ్లు ఏర్పాటుచేశారు. ఇందులో వీవీఐపీలకు 100, సాధారణ ప్రజలకు 1,400 మొబైల్ మరుగుదొడ్లు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి 200 మంది కార్మికులను నియమించారు. రోడ్ల మరమ్మతులు, పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటుకు 100 మంది ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారు.

భద్రతపై హోం మంత్రి ఆరా



భద్రతపై పోలీసులతో మాట్లాడుతున్న హోం మంత్రి

కర్నూలు క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించేందుకు రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత మంగళవారం కర్నూలు వచ్చారు. ఆమెతో పాటు మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యా రాణి కూడా కర్నూలు చేరుకున్నారు. నన్నూరు రాగమయూరిలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌లో భద్రతా చర్యలపై ఆరాతీశారు. ఉన్నతాస్థాయి అధికారులతో చర్చించారు. భద్రతా వ్యవస్థల పర్యవేక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, కమ్యూనికేషన్, ప్రజా సౌకర్యాలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. డీఐజీ సత్య యేసుబాబు, డీఎస్పీ భావన ఉన్నారు.

విద్యుత్ స్తంభాలు, లైట్లు..: ఎస్ఈ ప్రదీప్‌కుమార్



కల్లూరు : నన్నూరు టోల్‌ప్లాజా సమీపంలోని రాగమయూరి వెంచర్‌లో సభాప్రాంగణం, రోడ్డుకిరువైపులా విద్యుత్ స్తంభాలు, కొత్త లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం 22 ట్రాన్స్‌ఫార్మర్లు అందులో 315కేవీ-4, 160కేవీ-18, జనరేటర్లు-19 ఏర్పాటు చేశామన్నారు. మాన్‌సంస్థ కూడా జనరేటర్లను అందుబాటులో ఉంచామని, రూ.3.5 కోట్లతో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఈ స్పష్టం చేశారు.

రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకారం

- ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్
- ప్రధాని పర్యటన ఏర్పాట్ల పరిశీలన



మాట్లాడుతున్న మంత్రులు పయ్యావుల,అనగాని

శ్రీశైలం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. మంగళవారం మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్ రెడ్డి, చింతమనేని ప్రభాకర్, జిల్లా కలెక్టర్ రాజకుమారితో కలిసి ప్రధాని పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆలయం బయట విలేకరులతో మాట్లాడారు. శ్రీశైల క్షేత్రంకు భారత ప్రధాని రావడం మరింత పాశ్యాస్తాన్ని పెంచుతుందన్నారు. శ్రీశైల క్షేత్ర ప్రాముఖ్యత తెలుసుకోని ప్రధాని శ్రీశైలం రావడం ఎంతో మంచిదన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అడగకముందే రాష్ట్రానికి సకల సౌకర్యాలను కేంద్రం కల్పిస్తోందన్నారు. ముఖ్యమంత్రి కోరిన వెంటనే విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ నుంచి తొలగించారన్నారు. అంతేకాకుండా ఆ సంస్థకు అదనంగా నిధులు కూడా కేటాయించారన్నారు. రాయలసీమకు ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధి జరగాలంటే పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలన్నారు. అమరావతికి నిధులు అందించడంతో పాటు రూ.70 వేల కోట్లతో నేషనల్ హైవేలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. మరో రూ.70 నుంచి 80 వేల కోట్లతో రైల్వే ప్రాజెక్టులను చేపట్టబోతున్నట్లు మంత్రి పయ్యావుల తెలిపారు. పోలవరం, బనకచర్ల రాయలసీమకు ప్రత్యక్షంగా వీటన్నిటికి కూడా కేంద్రం మద్దతు ఇస్తోందని తెలిపారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినాక 16నెలల్లో దాదాపు 11లక్షల కోట్లు పెట్టుబడి తీసుకురావడం రాబోయే తరాలకు మంచిచేసే విధంగా ఉంటాయన్నారు. ప్రధాన మంత్రి టూర్‌లో ఎక్కడ కూడా ఇబ్బంది లేకుండా పర్యవేక్షిస్తున్నామన్నారు.

నేడు, రేపు పాఠశాలలకు సెలవు

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శ్రీశైలం, కర్నూలు పర్యటన దృష్ట్యా నంద్యాల జిల్లాలోని అన్ని పాఠశాలలకు బుధ, గురువారాల్లో సెలవు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బస్సులను రవాణా శాఖ అధికారులు స్వాధీనం చేసుకోవడంతో అన్ని పాఠశాలలకు రెండు రోజుల పాటు సెలవు ఇచ్చినట్లు తెలిపారు.

సీమ జలసిరి హంద్రీనీవా

- మంత్రి నిమ్మల రామానాయుడు

కర్నూలు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జలసిరి హంద్రీనీవా ప్రాజెక్టు అని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ సీఈ కబీర్‌బాషా ఆధ్వర్యంలో ఆయన చాంబర్‌లో ఉమ్మడి జిల్లా సాగునీటి ప్రాజెక్టుపై సమీక్షించారు. ప్రస్తుతం ఏపీ ప్రాజెక్టుల్లో ఎంత మోతాదులో నీటి నిల్వలు ఉన్నాయని, చేపట్టాల్సిన పనులు తదితర అంశాలపై చర్చించారు. సకాలంలో హంద్రీనీవా కాలువ పరిధిలోని 517 చెరువులను నింపాలని ఇంజనీర్లకు సూచించారు. సకాలంలో హంద్రీనీవా విస్తరణ పనులు పూర్తి చేసిన ఇంజనీర్లను అభినందించారు. సీమకు గుండెకాయ లాంటి హంద్రీనీవా పనులపై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో వివిధ జలాశయాల్లో 961 టీఎంసీలు నిల్వ ఉన్నాయని పేర్కొన్నారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూ.3,900 కోట్లతో విస్తరణ పనులు పూర్తి చేయడం వల్లే 733 కిలోమీటర్లు దూరంలోని కుప్పంకు కృష్ణా జలాలు తీసుకెళ్లామని గుర్తు చేశారు. సమీక్షా సమావేశంలో జలవనరుల శాఖ సలహాదారుడు వెంకటేశ్వరరావు ఈఎన్‌సీ నరసింహామూర్తి, సీఈలు కబీర్‌బాషా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఇంజనీర్లతో సమీక్షిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

శ్రీశైలానికి వాహన రాకపోకలు నిలిపివేత

నంద్యాల నూనెపల్లి/ శ్రీశైలం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 16న శ్రీశైలం పుణ్యక్షేత్రానికి రానున్నారు. ఈ నేపథ్యంలో భద్రతా కారణా దృష్ట్యా శ్రీశైలం వైపు వెళ్లే రహదారులపై వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ సునీల్‌షెరాన్ మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ సమయంలో హైదరాబాద్ నుంచి శ్రీశైలం వైపు ప్రయాణించే భక్తులు, దోర్నాల మార్గం ద్వారా శ్రీశైలానికి చేరుకునే యాత్రికులు తమ పర్యటన ప్రణాళికలను సవరించుకోవాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ట్రాఫిక్ పోలీసులు ఇచ్చే సూచనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. ప్రధానమంత్రి పర్యటన అనంతరం సాధారణ వాహన రాకపోకలు పునరుద్ధరించబడతాయని తెలిపారు.

ఆలూరులో ఫ్లెక్సీల రగడ

- చిరిగిన గుమ్మనూరు జయరాం జన్మదిన ఫ్లెక్సీలు
- పోలీస్‌స్టేషన్‌లో జయరాంపై ఫిర్యాదు

7

విద్య, వైద్య రంగాల్లో చేయూతకు కృషి

- కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరి

ఉద్యోగాలన్నారు.. మోసం చేశారు..!

7

శ్రీశైలంలో నిలకడగా నీటిమట్టం



- నీటి నిల్వ సామర్థ్యం 209 టీఎంసీలు

శ్రీశైలం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యాం నీటిమట్టం నిలకడగా ఉంది. మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి 883 అడుగులుగా ఉంది. నీటినిల్వ సామర్థ్యం 209 టీఎంసీలుగా నమోదైంది. రెండు విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి అనంతరం 65,246 క్యూసెక్కులు విడుదల చేశారు. ఎగువ జూరాల విద్యుత్ ఉత్పత్తి, సుంకేసుల 33,402 క్యూసెక్కులు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరాయి.



నారా లోకేశ్ కృషి అభినందనీయం

- రోడ్ల భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



బనగానపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయంగా రాష్ట్ర ప్రతిష్ఠను నిలబెట్టి పెట్టుబడుల హబ్‌గా ఏపీని తీర్చిదిద్దడంలో మంత్రి నారా లోకేశ్ కృషి అభినందనీయమని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన బనగానపల్లెలో విలేకరులతో మాట్లాడుతూ గూగుల్‌లో చారిత్రాత్మక ఒప్పందం చేసుకోవడంపై మంత్రి హర్షం వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో యువనేత నారా లోకేశ్ కృషితో ఏపీకి గూగుల్ కంపెనీ తీసుకొచ్చారన్నారు. చంద్రబాబు, నారా లోకేశ్ ఆధ్వర్యంలో కేవలం 15 నెలల్లో రూ.7లక్షల కోట్లకుపైగా పెట్టుబడులకు ఆమోదం తెలపడం 6.2లక్షల ఉద్యోగాలు కల్పించే దిశగా అడుగులు పడడం రాష్ట్ర చరిత్రలోనే ఒక మైలు రాయి అన్నారు. సీఎం సుస్థిర పాలన ద్వారా పెట్టుబడిదారుల విశ్వాసాన్ని గెలుచుకోగలుగుతున్నామన్నారు. ప్రభుత్వం సుదీర్ఘ కాలం రాష్ట్రంలో కొనసాగడం ద్వారానే అన్నివర్గాల్లో మరింత నమ్మకం పెంపొందించుకోగలమన్నారు.

శ్రీశైలంలో డీజీపీ

- ప్రధాని పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన హరీశ్‌కుమార్ గుప్తా
- సున్నిపెంటలో హెలీకాప్టర్ల ట్రయల్ రన్
- శ్రీశైలంలో 1,800 మంది పోలీసులు



సున్నిపెంట వద్ద హెలీకాప్టర్ ట్రయల్ రన్

శ్రీశైలం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో గురువారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పర్యటన నేపథ్యంలో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఏర్పాట్లను పరిశీలించారు. మంగళవారం శ్రీశైలానికి చేరుకున్న డీజీపీ ప్రధాని పర్యటన ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. సీనియర్ ఐపీఎస్ అధికారులు, ఈగల్ చీఫ్ రవికృష్ణ, కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, నంద్యాల ఎస్పీ సునీల్ షెరాన్, తదితర ఐపీఎస్‌లతో ఆయన సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ పటిష్ట నిఘా ఉంచినట్లు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా వెల్లడించారు.



మాట్లాడుతున్న ఎస్పీ సునీల్ షెరాన్

భద్రతా కారణాల దృష్ట్యా ఇప్పటికే నల్లమల అడవులను జల్లెడ పట్టామన్నారు. కేంద్ర బలగాలతో కూంబింగ్ చేశామన్నారు. ప్రధాని పర్యటించే హెలిప్యాడ్, రోడ్డు మార్గం, భ్రమరాంబ అతిథిగృహం, శివాజీ స్ఫూర్తికేంద్రం, మల్లన్న ఆలయ పరిసరాలు, సేఫ్ హౌస్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ప్రధాని భద్రతకు సంబంధించిన తీసుకున్న చర్యల గురించి ఆరా తీశారు. ఇదిలా ఉండగా ప్రధాని పర్యటన నేపథ్యంలో సున్నిపెంటకు మంగళవారం హెలీకాప్టర్లతో ట్రయల్ రన్ నిర్వహించారు. ప్రధాని భద్రతకు సంబంధించిన ప్రత్యేక బలగాలు, అధికారులు ట్రైల్‌ను పరిశీలించారు. డీజీపీ వెంట ఐపీఎస్ అధికారి అధిరాజ్ సింగ్ రాణా, ఏఎస్పీ ఎం.జావళి, ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ తదితరులు ఉన్నారు.

శ్రీశైలంలో 1,800 మంది పోలీసులు: శ్రీశైలంలో ప్రధాని పర్యటనకు సంబంధించి 1,800 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నంద్యాల ఎస్పీ సునీల్ షెరాన్ వెల్లడించారు. ఈ సందర్భంగా శ్రీశైలంలోని అతిథిగృహంలో ఏర్పాటు చేసిన పోలీసుల అధికారుల సమీక్షలో ఆయన పలు సూచనలు చేశారు. పోలీసులు, సిబ్బంది, ప్రతి ఒక్కరూ ఐడీ కార్డు తప్పనిసరిగా ధరించాలని ఆదేశించారు. ప్రధాని పర్యటించే ప్రాంతాలన్నీ క్షుణంగా తనిఖీ చేయాలన్నారు. శ్రీశైలానికి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. ప్రధానమంత్రి భద్రతాపరంగా అత్యంత భద్రత ఉంటుందన్నారు. గురువారం ప్రధాని పర్యటన నేపథ్యంలో ఆరోజు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీశైలానికి రాకపోకలు నిలుపుదల చేసినట్లు తెలిపారు.



శ్రీశైలంలో ముమ్మరంగా తనిఖీలు

శ్రీశైలం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రధాని పర్యటన నేపథ్యంలో నల్లమల అటవీ ప్రాంతంలో వచ్చే ప్రతి వాహనాన్ని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. సున్నిపెంట నుంచి శ్రీశైలం వరకు రోడ్డు మార్గాల్లో పోలీసులు, కేంద్ర బలగాలు తనిఖీలు చేపడుతున్నారు. గత వారం రోజుల నుంచి నల్లమలను స్పెషల్ పార్టీ బలగాలు జల్లెడపడుతూ కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. రోడ్ ఓపెనింగ్ పార్టీ సిబ్బంది హ్యాండ్ హోల్డ్ మెటల్ డిటెక్టర్లు, పోలీస్ జాగిలాలతో తనిఖీలు చేపడుతున్నారు.



పోలీస్ జాగిలాలతో సెర్చ్ ఆపరేషన్ చేస్తున్న పోలీసులు

ఏర్పాట్లు పూర్తి

(5వ పేజీ తరువాయి)

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సహా కేంద్ర, రాష్ట్ర మంత్రులు, కూటమి పార్టీల ప్రముఖ నాయకులు హాజరుకానున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రధాని సభను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రధాని సభకు 3 లక్షలకు పైగా ప్రజలు హాజరయ్యేలా పక్కా ప్రణాళికతో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రంలో మంత్రివర్గం మొత్తం కర్నూలులో మకాం వేసింది. దాదాపు వంద మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, మంగళవారం రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, బీసీ జనార్ధన్‌రెడ్డి, టీజీ భరత్, ఎన్ఎండీ ఫరూక్, నారాయణ, అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, సత్యకుమార్‌యాదవ్, అనగాని సత్యప్రసాద్, వంగలపుడి అనిత, రాంప్రసాద్ సహా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ తదితరులు సభా ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జనసమీకరణ కోసం ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమై నియోజకవర్గం నుంచి ఎంత మంది సభా ప్రాంగణానికి ఎలా చేర్చాలి, ఆహారం, తాగునీరు సరఫరా వంటి ఏర్పాట్లపై సమీక్షించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, నారా లోకేశ్‌లు ఏర్పాట్లపై కూటమి నేతలకు వీడియో, టెలీ కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు. అలాగే పీఎం ప్రోగ్రామ్ స్పెషల్ ఆఫీసర్ వీరపాండియన్, కర్నూలు కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

వైద్య బృందాల ఏర్పాటు

- కీలక ప్రాంతాల్లో 11 శిబిరాలు
- సభావేదిక సమీపంలోనూ వైద్య సిబ్బంది

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి పర్యటన నేపథ్యంలో ఎటువంటి సమయంలోనైనా అత్యవసర చికిత్స అందించేలా జిల్లా వైద్యాధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. రాగమయూరి గ్రీన్ హిల్స్ 11 పార్కింగ్ స్థలాల్లో 11 వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాలను డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ పర్యవేక్షిస్తున్నారు. వైద్య బృందంలో వైద్యాధికారితో పాటు స్టాఫ్ నర్సు, సూపర్‌వైజర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు ఉంటారు. అలాగే హెలిప్యాడ్ వద్ద స్పెషలిస్టు డాక్టర్‌తో కూడిన ఓ టీం, ఎయిర్‌పోర్టు వద్ద మరో మెడికల్ టీమ్‌ను సిద్ధంగా ఉంచారు. అదేవిధంగా సభావేదిక వద్ద కూడా 65 టీంలు సిద్ధంగా ఉంటాయి. ఈ వైద్య శిబిరాలను డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పద్మావతి, అడిషినల్ డైరెక్టర్ సునీల్, కడప ఆర్‌డీ రామగిడ్డయ్య స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.



వేదిక వద్ద వైద్య పరికరాలు

20 పడకలతో తాత్కాలిక వైద్యశాల

- వీఐపీల కోసం పది బెడ్లు
- ప్రధాని సభలో హాస్పిటల్



20 పడకల తాత్కాలిక హాస్పిటల్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా నన్నూరు రాగమయూరి గ్రీన్‌హిల్స్ వద్ద 20 పడకలతో సాధారణ ప్రజలు, వీఐపీల కోసం మరో పది బెడ్లతో ప్రత్యేక హాస్పిటల్‌ను సిద్ధం చేశారు. ఈ ఆసుపత్రి నిర్వహణ, ఏర్పాట్లను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు పర్యవేక్షిస్తున్నారు. అలాగే వీఐపీల కోసం పది పడకలతో కూడా హాస్పిటల్ సిద్ధం చేశారు. వీటితో పాటు ప్రధానమంత్రి పర్యటన సందర్భంగా నన్నూరు రాగమయూరి గ్రీన్‌హిల్స్ వద్ద 14 మెడికల్ టీమ్‌లను డిప్యూటేషన్‌పై నియమించారు. మెడికల్ టీమ్‌లో ఆర్థో, ఫిజీషియన్, సర్జన్, అనస్థీషియా, కార్డియాలజి హెడ్ నర్సు, స్టాఫ్ నర్సు, ఈసీజీ టెక్నీషియన్, అనస్థీషియా టెక్నీషియన్, ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వో, డ్రైవర్ శానిటేషన్ వర్కర్స్ సభ్యులుగా ఉంటారు. 14న మెడికల్ టీమ్‌ల్లో ఒక్కొక్క టీమ్‌లో 11 మంది సభ్యులుగా ఉంటారు. నన్నూరు రాగమయూరి హిల్స్ వద్ద 300 మంది వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, ఇతర సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. అలాగే వీఐపీ, సాధారణ ప్రజల కోసం మొత్తం 30 పడకలతో తాత్కాలిక హాస్పిటల్‌ను ఏర్పాటు చేశారు. 15 పార్కింగ్ ప్రదేశాల్లో 104, 108 అంబులెన్సులను పదుల సంఖ్యలో సిద్ధంగా ఉంచారు. తాత్కాలిక వైద్యశాలను సూపరింటెండెంట్‌తో పాటు సీఎస్ఆర్ఎంవో డాక్టర్ టీసీహెచ్ వెంకటరమణ, డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా, అడ్మినిస్ట్రేషన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివబాల స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.



జాతీయ రహదారి వెంబడి కూటమి పార్టీల జెండాలు



తుదిదశకు రహదారి నిర్మాణ పనులు



సభావేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐపీఎస్ అధికారులు



ప్రధాని పర్యటన ప్రాంతంలో తాత్కాలిక ఆసుపత్రి

ప్రధాని రాకతో పాఠశాలలకు సెలవు : డీఈవో

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 16వ తేదీన ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటిస్తుండటంతో 15, 16 తేదీల్లో జిల్లా అంతటా అన్ని యాజమాన్యాల పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు డీఈవో శామ్యూల్‌పాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని యాజమాన్యాల పాఠశాలలకు ఈ సెలవు వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. విద్యా సంస్థలు ఈ అంశమని గమనించి సహకరించాలని ఆయన కోరారు. ఆ రోజుల్లో జరిగే ఎఫ్ఏ-2 పరీక్షలు ఈనెల 21, 22 తేదీల్లో నిర్వహించాలని సూచించారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, వేదికపై నియోజకవర్గ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి తదితరులు

ఆలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అధ్యక్షతన మంగళవారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నియోజకవర్గ కూటమి నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన మంత్రి మాట్లడుతూ అభివృద్ధే ప్రధాన ఎజెండాగా సీఎం చంద్రబాబు పాలన సాగుతుందన్నారు. ఈసారి సంక్షేమానికి పెద్దపీట వేసి అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తున్నారన్నారు. 16న కర్నూలులో జరగనున్న ప్రధాని మోదీ బహిరంగ సభలో రాష్ట్రంలో నూతన పెట్టుబడులు, కొత్త పరిశ్రమలను ప్రకటించనున్నారన్నారు. నియోజకవర్గం నుంచి బహిరంగ సభకు పెద్ద ఎత్తున జన సమీకరణ చేయాలని సీఎం ఆదేశాలు ఉన్నాయన్నారు. వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి 20వేల మందితో కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు వైకుంఠం శివప్రసాద్, వాల్మీకి, శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్లు కప్పట్రాళ్ల బొజ్జమ్మ, సత్తిబాబు, బీజేపీ ఇన్‌చార్జి వెంకట రాముడు, జనసేన నాయ కులు రంజిత్, టీడీపీ నాయకులు రామచంద్రనాయుడు, మండల కన్వీనర్లు తిప్పయ్య, విజయ్, కృష్ణయాదవ్, చిట్టి, నరసప్ప, కొన్నంకి మోహన్, శేషగిరి, ఉచ్చీరప్ప, విష్ణువర్ధన్‌రెడ్డి, బెంగళూరు కిషోర్, సీనప్ప, కురువ హనుమప్ప పాల్గొన్నారు.

అభివృద్ధి బాటలో రాష్ట్రం

- ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రాంప్రసాద్
- లక్షలాదిగా జనసమీకరణ చేసేందుకు ఏర్పాట్లు
- వేమూరు ఎమ్మెల్యే నక్క ఆనంద్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నక్క ఆనంద్‌బాబు, ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రాంప్రసాద్

ఆళ్లగడ్డ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తోందని ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రాంప్రసాద్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ నివాసానికి వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే నక్క ఆనంద్‌బాబుతో కలిసి చేరుకున్నారు. టీడీపీ నాయకులు భార్గవ్‌రాం, భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డితో కలిసి నియోజకవర్గంలోని ఆరు మండలాల కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ 17నెలల క్రితం కూటమి ప్రభుత్వంపై ఎంతో నమ్మకంతో అధికారాన్ని ఇచ్చారన్నారు. ఈనెల 16న ప్రధాని నరేంద్ర మోదీపర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మెల్యే నక్క ఆనంద్‌బాబు మాట్లాడుతూ నంద్యాల జిల్లా నుంచి లక్షలాదిగా జన సమీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం అన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. నక్క ఆనంద్‌బాబు, రాంప్రసాద్, ఆళ్లగడ్డ పరిశీలకుడు పవన్‌కుమార్‌ను శాలువా కప్పి భార్గవ్‌రామ్, భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి ఘనంగా సన్మానించారు.

ప్రజారవాణాలో ఆటంకాలు ఉండొద్దు

- మంత్రుల ఆదేశాలు

కర్నూలు క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రధాని సభకు వచ్చే ప్రజలకు రవాణాలో ఎలాంటి ఆటంకాలు ఉండరాదని మంత్రులు నారాయణ, గొట్టిపాటి రవికుమార్, రాంప్రసాద్‌రెడ్డి ఆదేశించారు. ప్రజారవాణాపై మంత్రులు చర్చించారు. సభా ప్రాంగణాల వద్ద నియోజకవర్గాల వారీగా వాహనాల ప్రవేశం, పార్కింగ్ స్థలం, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. పోలీసు, రవాణా శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని అన్నారు. డీటీసీ శాంతకుమారి, ఆర్‌టీఏలు, ఎంవీఐలు ఉన్నారు.

సాగునీటి నిపుణుడు సుబ్బరాయుడు మృతి

- వేదావతి, గుండ్రేవుల ప్రాజెక్టుల రూపశిల్పి
- సిద్ధేశ్వరం ప్రాజెక్టు కోసం అలుపెరగని పోరాటం
- తుదిశ్వాస వీడేవరకు సీమ ప్రాజెక్టుల కోసం పరితపించిన వ్యక్తి
- అనారోగ్యంతో మరణం.. పలువురి ప్రగాఢ సంతాపం

కర్నూలు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాయలసీమ సాగునీటి నిపుణుడు, రిటైర్డ్ ఈఈ సుబ్బరాయుడు(80) అనారోగ్యంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస వీడారు. ఆయన మరణంతో సీమ ఓ జలవనరుల నిపుణుడిని కోల్పోయింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సహా పలువురు వామపక్ష నాయకులు, ఇంజనీర్లు, రాయలసీమ సాగునీటి సాధన సమితి, సీమ మేధావుల ఫోరం నాయకులు ఆయన భౌతికాయాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వృథాగా కడలి పాలవుతున్న కృష్ణా, తుంగభద్ర వరద రాయలసీమ కరువు పల్లెలకు మళ్లించి మెట్ట చేలను సస్యశ్యామలం చేయాలని తుదిశ్వాస వీడేవరకు తపించిన వ్యక్తి సుబ్బరాయుడు. జలవనరుల శాఖలో ఏఈగా విధుల్లో చేరిన ఆయన తెలుగుగంగ, ఎస్సార్బీసీ, హంద్రీనీవా ప్రాజెక్టుల్లో ఏఈఈ, డీఈఈ, ఈఈగా పని చేసి 2005లో పదవి విరమణ పొందారు. ఆ తరువాత కుటుంబ సభ్యులతో కలసి విరామ జీవితం గడపలేదు. సముద్రం పాలవుతున్న తుంగభద్ర జలాలు రాయలసీమ ప్రాంతానికి మళ్లిస్తే కరువు, వలసలు నివారించవచ్చని ప్రభుత్వానికి పలు నివేదికలు పంపించారు. వేదావతి ప్రాజెక్టు, గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మిస్తే కర్నూలు పశ్చిమ ప్రాంతం సహా రాయలసీమ సస్యశ్యామలం అవుతుందని క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు తయారు చేశారు. ప్రభుత్వాలకు పంపించారు. ఆయన నివేదికల ఆధారంగానే ప్రభుత్వం డీపీఆర్ తయారు చేయించింది. ఈ రెండు ప్రాజెక్టులకు 2019 జనవరిలో నాటి సీఎం చంద్రబాబు రూ.6వేల కోట్లు మంజూరు చేశారు.



సుబ్బరాయుడు (ఫైల్)

సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం చేస్తేనే..

సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం చేస్తేనే సీమ పచ్చగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయడమే కాదు. సీమ సాగునీటి నిపుణులను మేల్కొలిపి సిద్ధేశ్వరం అలుగు కోసం పోరాటం చేసిన వారిలో ఒకడిగా నిలిచారు. ఆ క్రమంలో శ్రీశైలం ఎగువన కృష్ణా నదిపై సిద్ధేశ్వరం అలుగు నిర్మించే ప్రదేశాన్ని సీమ సాగునీటి నిపుణులతో కలసి పరిశీలించేందుకు వెళ్లిన సుబ్బరాయుడు రాళ్లు దాటతుండగా కాలికి పదునైన రాయి తగిలి రక్తగాయమైంది. ఆ గాయం పెద్దదై చివరికి కాలు తీసేయాల్సి వచ్చింది. కృత్రిమ కాలు ఏర్పాటు చేసుకొని సీమ ప్రాజెక్టుల కోసం నిరంతరం శ్రమిస్తూ వచ్చారు. చనిపోవడానికి నాలుగైదు రోజులు ముందు కూడా గుండ్రేవుల జలాశయం 40 టీఎంసీల సామర్థ్యానికి పెంచితే కలిగే జల ప్రయోజనాలు తదితర అంశాలపై నిపుణులతో చర్చించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. అంతలో ఆరోగ్యం బాగలేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించగా, కోలుకోలేక మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆగస్టు 6న సీమ ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన సాగునీటి నిపుణులు టి.లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, అక్కినేని భవానీప్రసాద్, నల్లబోతు చక్రవర్తి, జొన్నలగడ్డ రామారావు, బొజ్జ దశరథరామిరెడ్డి తదితరులు సుబ్బరాయుడును కలసి సీమ ప్రాజెక్టులపై చర్చించారు. ఈ రోజు ఆయన ఈ లోకాన్ని విడిచివెళ్లపోవడం సీమకు తీరని అన్యాయమని టి.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలి

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): 16న పీఎం మోదీ పర్యటనను విజయవంతం చేయాలని ఎన్జీవోస్ అసోసియేషన్ నగర అధ్యక్షుడు ఎంసీ కాశన్న పిలుపునిచ్చారు. మంగళవారం నాయకుల సమావేశం నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్యతరగతి వర్గాలకు దీపావళి వెలుగులు నింపిన మోదీ సభను ఉద్యోగులు, ఉపాధ్యాయులు కార్మికులు, పెన్షనర్లు విజయవంతం చేయాలని కోరారు. నాయకులు ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస యాదవ్, ముర్తుజావలి, రామకృష్ణ, హరికృష్ణ గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాశన్న

ఉద్యోగాలన్నారు.. మోసం చేశారు..!

- ఒక్కొక్కరి నుంచి రూ.3.50లక్షల దాకా వసూలు
- ఉడాయించిన కేటుగాళ్లు
- రోడ్డెక్కిన బాధితులు
- న్యాయం చేస్తామని డీఎస్పీ హామీ

దొర్నిపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇస్తామన్నారు.. నమ్మకంగా కలిగే ప్రవర్తించారు.. తీరా మోసం చేశారు. నిరుద్యోగుల నుంచి వసూలు చేసిన వంద కోట్ల రూపాయలతో ఉడాయించారు. బాధితులు న్యాయం కోసం రోడ్డెక్కారు. ఆత్మహత్య శరణ్యమంటూ పురుగుమందు డబ్బాలతో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. స్థానికులు తెలిపిన వివరాలు.. దొర్నిపాడుకు చెందిన బాసిరెడ్డి వీరారెడ్డి, అతడి అల్లుళ్లు రాజారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి హెల్త్ అండ్ వెల్త్ ఫైనాన్షియల్ కంపెనీ ప్రారంభించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని ఒక్కొక్కరి నుంచి రూ.2.50లక్షల నుంచి రూ.3.50ల వరకు వసూలు చేశారు. మూడేళ్ల ఉద్యోగ భద్రత కల్పించి నెలకు రూ.40వేలు జీతం ఇస్తామని భరోసా ఇచ్చారు.



ఆర్‌అండ్‌బీ రోడ్డుపై బైఠాయించిన బాధితులు

ఆళ్లగడ్డ, రుద్రవరం, దొర్నిపాడు, అనంతపురం జిల్లా యల్లనూరు మండలాని చెందిన దాదాపు 2,500మంది నిరుద్యోగులు డబ్బులు చెల్లించారు. వీరిని హెల్త్ అండ్‌వెల్త్ కంపెనీలో చేర్పించుకొని రూ.40వేలు జీతం కొన్నినెలలు అందజేశారు. నిరుద్యోగులు ఆ కంపెనీకి ఆకర్షితులయ్యారు. ఉద్యోగాల నానా పాట్లు పడి ఇళ్లు, బంగారు తాకట్టు డబ్బులు చెల్లించారు. కాగా ఈనెల 7వ తేదీన యల్లనూరు పోలీసుస్టేషన్‌లో రాజారెడ్డిపై చీటింగ్ కేసు నమోదైంది. నెల నుంచి జీతాలు ఇవ్వకపోవడంతో వీరారెడ్డిని బాధితులు ప్రశ్నించారు. డబ్బులు ఇస్తానని బాధితులను నమ్మబలికించాడు. మంగళవారం 500మంది దాకా రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి అక్కడికి చేరుకొని విషయంపై ఆరా తీశారు. డబ్బులు కట్టించుకున్న వారిపై కేసు నమోదుచేసి న్యాయం చేసేలా చూస్తానని అన్నారు. తమకు న్యాయం చేసే వర కు నిరసన విరమించేది లేదని బాధితులు రోడ్డుపై బైఠాయించారు. దీంతో డీఎస్పీ ప్రమోద్ బాధితుల వద్దకు వచ్చి ఎవరు ఎంత డబ్బు కట్టింది తగిన రశీదులతో పోలీసుస్టేషన్‌లో అందజేస్తే వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. రాజారెడ్డి, వీరారెడ్డి, మహేశ్వర్‌రెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి

బేతంచెర్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని కొమ్మూరికొట్టాల గ్రామ సమీపంలో ఉన్న జిందాల్ మైన్స్‌లో చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు. వివరాలు.. బేతంచెర్లకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి(28) జిందాల్ మైన్స్‌లో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం శ్రీకాంత్‌రెడ్డి తన పనిలో నిమగ్నమై ఉండగా.. టిప్పర్ వాహనం డ్రైవర్ చంద్రశేఖర్ రెడ్డి అజాగ్రత్తగా అకస్మాత్తుగా వెనకి నుంచి ఢీకొట్టడంతో తీవ్రంగా గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం శ్రీకాంత్‌రెడ్డిని కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని తల్లి లక్ష్మీదేవి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి దుర్మరణం

ఆళ్లగడ్డ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బస్సును తప్పించబోయి బైక్ అదుపుతప్పి మొక్కజొన్న పంటలో దూసుకుపోయి ఓవృద్ధురాలి దుర్మరణం పాలైంది. ఈ ఘటన మండలంలోని జమ్మలమడుగు రస్తాలో మంగళవారం చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. నంద్యాలకు చెందిన వెంకటసుబ్బారెడ్డి, జయ లక్ష్మమ్మ(59) బైక్‌పై జమ్మలమడుగు మండలం పాలూరులో వారి బంధువులు చనిపోగా చూసి తిరిగి వస్తున్నారు. జమ్మలమడుగు రస్తాలో రైతులు మొక్కజొన్న పంటను ఆరబెట్టారు. ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి వారి బైక్ మొక్కజొన్న పంటలోకి దూసుకుపోయింది. అదుపు తప్పి కింద పడటంతో జయలక్ష్మమ్మ బస్సు చక్రాల కింద పడింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని కేసు నమోదు చేశారు.

కొడుకు పుట్టలేదని కలత చెంది..

- గూడ్స్‌రైలు కిందపడి వ్యక్తి బలవన్మరణం



విలపిస్తున్న కుటుంబ సభ్యులు

ఆదోని, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అతడికి ఓ కుమార్తె ఉందని, కొడుకు పుట్టలేదని కలత చెందాడు. గూడ్స్ రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఇస్వీ రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకున్నట్లు రైల్వే ఎస్‌ఐ గోపాల్ తెలిపారు. వివరాలు.. ఆదోని మండలం మదిరే గ్రామానికి గంపల సోమ(31) పెళ్లై ఓకుమార్తె కూడా ఉంది. ఎనిమిదేళ్లుగా మగ సంతానం కోసం అతడు పరితపిస్తున్నాడు. ఈ విషయంలో మనోవేదనకు గురయ్యాడు. మంగళవారం మధ్యాహ్నం ప్రాంతంలో ఇస్వీ రైల్వేస్టేషన్ వద్దకు చేరుకున్నాడు. అటుగా వస్తున్న గూడ్స్ రైలుకు ఎదురుగా వెళ్లడంతో రైలు ఢీకొంది. సోమ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు

చాగలమర్రి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డివైడర్‌ను కారు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ఘటన మండలంలోని నగల్లపాడు గ్రామ సమీపంలో మంగళవారం చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. హైదరాబాదు నుంచి తిరుపతికి వెళ్తున్న కారు టైర్ పంచర్ కావడంతో అదుపుతప్పి పక్కనే డివైడర్‌ను ఢీకొంది. కారులో వెళ్తున్న క్రిష్ణమూర్తి, భారతి గాయపడ్డారు. కారు నుజ్జు అయింది. టోల్ ప్లాజా సిబ్బంది స్పందించి డివైడర్ ఢీకొన్న కారును తొలగింప చేసి రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని కేసు నమోదు చేశారు.

తేలిన బంగారు ఆభరణాల లెక్క



తనిఖీ చేస్తున్న జువెలరీ అధికారి పాండురంగారెడ్డి

- క్షుణ్ణంగా తనిఖీ చేసిన అధికారి

బనగానపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నందవరం శ్రీచౌడేశ్వరీమాత బంగారు ఆభరణాల లెక్క తేలింది. మంగళవారం జువెల్లరీ అధికారి పాండురంగారెడ్డి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గతంలో పనిచేసిన ఈవోలు రామానుజన్, కామేశ్వరమ్మ, ప్రస్తుత ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, ఆలయ సిబ్బంది, ఆలయ పూజారుల సమక్షంలో చౌడేశ్వరీమా ఆభరణాలను లెక్కించారు. మొత్తం 7కిలోల 435 గ్రాముల, 140 మిల్లీ గ్రాములుగా లెక్క తేల్చారు. 12 ఏళ్లుగా ఆభరణాలను లెక్కలు తేల్చకపోవడంతో కొంత బంగారు మాయమైందని భక్తులు ఆరోపణలు చేశారు. ఇటీవలే ఓ భక్తురాలు దేవదాయశాఖ అధికారులకు పిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. బ్యాంకు లాకర్లలో ఉన్న బంగారు ఆభరణాలను ఆలయానికి తీసుకువచ్చి తనిఖీ చేశారు. ప్రతి బంగారు వస్తువులను రికార్డులతో సరిచూశారు. బంగారు ఆభరణాలు యథాతథంగా ఉన్నాయని, ఏ ఒక్క ఆభరణం మాయం కాలేదని భక్తుల ఆరోపణలను దేవాదాయశాఖ అధికారులు నివృత్తి చేశారు. పాండురంగారెడ్డి మాట్లాడుతూ అమ్మవారి ఆభరణాలు సక్రమంగానే ఉన్నాయని, ఇంకా వెండి వస్తువులను తనిఖీ చేస్తున్నట్లు వెల్లడించారు.

విద్య, వైద్య రంగాల్లో చేయూతకు కృషి

- కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ బ్రహ్మం చౌదరి



బ్రహ్మం చౌదరిని సన్మానిస్తున్న కమ్మసంఘం నాయకులు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కమ్మ కులానికి చెందిన పేద, మధ్యతరగతి కుటుంబాల వారికి విద్య వైద్య రంగాల్లో చేయూత అందించేందుకు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ బ్రహ్మం చౌదరి అన్నారు. ఇటీవల ఏపీ కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బ్రహ్మం చౌదరి మంగళవారం కర్నూలుకు వచ్చారు. ఈ సందర్భంగా కొత్త బస్టాండు సమీపంలోని హోటల్ త్రిగుణ ఇన్ సమావేశ హాలులో ఆయనను జిల్లా కమ్మసంఘం నాయకులు కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో కమ్మ సమాజాభివృద్ధికి, పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన కమ్మ కుల నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పడడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమ్మ సంఘం అధ్యక్షుడు కమ్మ కృష్ణమోహన్, కార్యదర్శి పెనికలపాటి రాజశేఖర్, కార్యవర్గ సభ్యులు దుగ్గపూడి నాగిరెడ్డి, డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, గుమ్మల్ల శేఖర్, పోలూరు శేఖర్, తమ్మినేని మీనాక్షి నాయకుడు, సోంపల్లి శేఖర్, మాధవనాయుడు, నాయినేని ఉపేంద్ర, రాయవరపు లక్ష్మీనారాయణ, ఆపతి చంద్రశేఖర్, సాదినేని మురళీధర్, పెనికలపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ ఇన్‌చార్జి ఏడీగా మల్లేశ్వరమ్మ



కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీ (కేఎంసీ) ఇన్‌చార్జి అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా మల్లేశ్వరమ్మను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డా.కే.పద్మావతమ్మ ఉత్తర్వులు జారీ చేశారు. ఏడీగా పని చేస్తున్న నాగరత్నమ్మ ఇటీవల డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది కడప రీజనల్ డైరెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఖాళీగా ఉన్న స్థానాన్ని కర్నూలు జీజీహెచ్‌లో ఏడీగా ఉన్న వై.మహేశ్వరమ్మను ఇన్‌చార్జి ఏడీగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

డీటీబ్ల్యూవోగా సురేష్

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిగా డి.సురేష్ మంగళవాం బాధ్యతలు స్వీకరించారు. కొద్దికాలంగా ఇన్‌చార్జి అధికారులే బాధ్యతలు నిర్వహించారు. అనంతపురం జిల్లాలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న సురేష్‌ను ఉన్నతాధికారులు పదోన్నతిపై కర్నూలుకు పంపారు.

'గూగుల్‌తో అభివృద్ధి'

- ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ పూల నాగరాజు



కర్నూలు కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గూగుల్ రాకతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని, యంగెస్ట్ స్టేట్‌గా ఉన్న నవ్యాంధ్రప్రదేశ్ హైఎస్ట్ స్టేట్‌గా నిలుస్తుందని ఏపీఎస్ఆర్టీసీ కడప రీజనల్ ఛైర్మన్ పూల నాగరాజు అన్నారు. మంగళవారం కర్నూలు విచ్చేసిన ఆయన మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ఒకవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మరోవైపు మంత్రి నారా లోకేష్ అహర్నిశలు శ్రమించి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కంపెనీలను రాష్ట్రానికి తీసుకువస్తున్నారని అన్నారు. 12 నెలలు పాటు శ్రమించి నేషనల్ పాలసీల్లో కూడా మార్పులు చేయించి 2లక్షల మందికి ఉపాధి కల్పించడం, గూగుల్ క్లౌడ్ సంస్థను రాష్ట్రానికి తీసుకురావడం మంత్రి నారా లోకేష్ కృషి అభినందనీయమన్నారు. హైదరాబాదు మైక్రోసాఫ్ట్ రావడంతో ఎలా గేమ్ ఛేంజర్ అయిందో, అలా ఇప్పుడు గూగుల్ విశాఖకు రావడం ఏపీ భవిషత్ అభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా మారుతోందని అన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ మాటలకే పరిమితం చేయకుండా శ్రీకాకుళం నుంచీ చిత్తూరు వరకు ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు.

16, 17 తేదీల్లో చెస్ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరలోని కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో ఈ నెల 16, 17 తేదీల్లో రాజావర్ధన్ రెడ్డి జ్ఞాపకార్థం చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నాయక్, ఇమామ్ తెలిపారు. మంగళవారం ఎంపీ నాగరాజు, డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే దస్తగిరి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డితో కలిసి కరపత్రాలు విడుదల దుల చేశారు. రాజావర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులు ఏవీ సుచిత్ర, ఏవీ ప్రవీణ్ కుమార్ రెడ్డి, డి.మిత్రవింద, ఏవీ ప్రశాంత్ రెడ్డి సహకారంతో రూ.3లక్షల నగదు బహుమతి, 200 ప్రోత్సాహక బహుమతులు ఇస్తున్నట్లు తెలిపారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

మోదీ సభను విజయవంతం చేద్దాం

- తెరపైకి గొందిపర్ల బ్రిడ్జి, గుండ్రేవుల ప్రాజెక్టు
- కోడుమూరు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల సమావేశం



మాట్లాడుతున్న కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహా రెడ్డి

కర్నూలు రూరల్ అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16వ పీఎం సభను విజయవంతం చేయాలని కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కోడుమూరు నియోజకవర్గ కూటమి నాయకుల సమావేశంలో మాట్లాడుతూ వెనకబడిన రాయలసీమ అభివృద్ధి చెందాలన్నదే సీఎం చంద్రబాబు ఉద్దేశ్యమమన్నారు. అందుకే మోదీని కర్నూలుకు తీసుకొస్తున్నారని వివరిం చారు. నాయకులు సమష్టిగా కృషిచేసి జనసమీకరణ చేసి సభకు తీసుకరావాలన్నారు. వైసీపీ రాక్షస పాలనతో ఐదేళ్ల నరకం అనుభవించా మన్నారు. డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి జనం తరలింపులో కీలకం కానున్నట్లు వివరించారు. పార్టీ పరిశీలకుడు రామలింగారెడ్డి మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన నాయ కులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని, త్వరలోనే శుభవార్త వింటారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించే బాధ్యత తామే తీసుకుంటామన్నారు. నియోజ కవర్గానికి 800 ఆర్టీసీ బస్సులు కేటాయించామని, నాయకులు ప్రజలను సభకు తరలించాలని సూచించారు.

- కాగా ఈ సమావేశంలో గొందిపర్ల బ్రిడ్జి, గుండ్రేవుల ప్రాజెక్టు అంశం తెరపైకి వచ్చింది. కర్నూలు నుంచి గొందిపర్ల, దేవమడకు 26 కి.మీ.లు ప్రయానించాల్సి వస్తోందని కేడీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. పాతబస్టాండ్ రాఘవేంద్ర మఠం నుంచి తుంగభద్ర మీదుగా గొందిపర్ల వరకు వంతెన నిర్మిస్తే అక్కడి ప్రజలలు 2 కి.మీ.లు ప్రయాణించి కర్నూలుకు చేరుకుంటారన్నారు. వంతెన నిర్మాణానికి రూ.293 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని, అలాగే గుండ్రేవుల ప్రాజెక్టు, కోడుమూరు, ప్యాలకుర్తికి శాశ్వత మంచి నీటి సౌకర్యాం కోసం నిధులు కేటాయించేలా మాట్లాడేందుకు సభలో పీఎం, సీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

జీఎస్టీ సంస్కరణలతో..

- మంత్రి గొట్టిపాటి రవికుమార్



మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

కల్లూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): 16న ప్రధానమంత్రి మోదీ జిల్లా పర్యటనను జయప్రదం చేద్దామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గౌరుచరిత, గౌరు వెంకటరెడ్డి, ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ 2.0 సంస్కరణతో అన్నివర్గాల ప్రజలకు ఉపశమనం కలిగించిన ప్రధాని మోదీ బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, ఎమ్మెల్యేలు అశోక్‌రెడ్డి, చైతన్యరెడ్డి, యం.ఎస్.రాజు, జనసేన అధ్యక్షుడు చింతా సురేష్‌బాబు, బీజేపీ నాయకుడు శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

తెగిపడిన మెయిన్ విద్యుత్ వైరు

కోసిగి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాల్గవ వార్డు ఈశ్వరస్వామి దేవాలయం ముందు మెయిన్ విద్యుత్ వైరు ఇంటిపై తెగి పడటంతో పెద్ద ప్రమాదమే తప్పింది. కాలనీవాసులు సజ్జలగుడ్డం నాగరాజు, కొల్లి వినోద్‌కుమార్, కొల్లి వీరేష్‌తో పాటు మరో 50మంది కాలనీ వాసులు విద్యుత్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో మెయిన్ లైన్ విద్యుత్ వైరు కిందకు తెగి పడటంతో నిప్పురవ్వలు ఎగిసిపడి కాలనీవాసులు భయాందోళనలతో బయటకు వచ్చేశారు. విద్యుత్ అధికారులు, లైన్‌మెన్లు సమయానికి స్పందించకపోవడంతో కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏడాది కాలంగా సమస్య ఉందని చెబుతున్నప్పటికీ విద్యుత్ అధికారులు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మెయిన్‌లైన్ వైరును విద్యుత్ సిబ్బందితో కాకుండా ప్రైవేటు వ్యక్తితో మరమ్మతు చేయించడ మేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. విషయాన్ని విద్యుత్ ఏఈ వీరేష్‌ను వివరణ కోరగా.. లైన్‌మెన్‌కు సమాచారం ఇచ్చామని, వారు సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు.

- తప్పిన ప్రమాదం



తెగిపడిన విద్యుత్ వైరును చూపుతున్న స్థానికులు


ఆలూరులో ఫ్లెక్సీల రగడ

- చిరిగిన గుమ్మనూరు జయరాం జన్మదిన ఫ్లెక్సీలు
- వైకుంఠం అనుచరులపై గుమ్మనూరు మండిపాటు
- పెద్దఎత్తున గుమికూడిన ఇన్‌చార్జి జ్యోతి అనుచరులు
- పోలీస్‌స్టేషన్‌లో జయరాంపై ఫిర్యాదు



ఎమ్మెల్యే జయరాం, వైకుంఠం జ్యోతి అనుచరుల వాగ్వాదం

ఆలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉన్న ఆలూరులో అనంతపురం జిల్లా గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరా జన్మదినం సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు చిరిగిపోవడం మంగళవారం వివాదస్పదంగా మారింది. ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అనుచరులు ఫ్లెక్సీలు చింపేశారని జయరాం ఒక్కసారిగా కోపోద్రిక్తుడయ్యారు. దీంతో వైకుంఠం జ్యోతి అనుచరులకు, జయరాంకు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఒక్కసారిగా పెద్దఎత్తున టీడీపీ నేత వైకుంఠం శివప్రసాద్ అక్కడికి చేరుకోకముందే పోలీసులు వివాదాన్ని సద్దుమణిగించి అక్కడి నుంచి జయరాంను పంపించివేశారు. దీంతో ఏం జరుగుతుందోనని టీడీపీ కార్యకర్తల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఉద్దేశపూర్వకంగానే ఫ్లెక్సీలు చింపివేశారని జయరాం ఆరోపించారు. ఇదే విషయంపై ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ ఫ్లెక్సీలు చింపి వేసే అంత దిగజారుడు రాజకీయాలు తమవి కావన్నారు. అనవసరంగా తమ అనుచరులపై ఆరోపణలు చేయడం ఎమ్మెల్యే జయరాంకు తగదన్నారు. తాను కూడా జరిగిన సంఘటనపై పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గుమ్మనూరు జయరాం, శ్రీనివాసులపై పోలీసులకు వైకుంఠం జ్యోతి అనుచరులు అబిద్, శివ, నాగరాజులు ఆలూరు ఇన్‌చార్జి ఎస్‌ఐ దిలీప్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



WANTED

ఎమ్మిగనూరు, ఆదోని, కర్నూలు, నంద్యాల, పాణ్యంలో చిట్‌ఫండ్ కంపెనిలో పనిచేయుటకు సిబ్బంది కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధన్యత ఇవ్వబడును. సంప్రదించవలసిన సెల్ నెంబర్ : 9885614589.

AJL-KNL

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: 7382114647.

AJA- 246951

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి



విద్యార్థుల ప్రగతికి కృషి చేయాలి

మహానంది, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రగతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని నంద్యాల జిల్లా సర్వశిక్ష అభియాన్ అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ మాధవి అన్నారు. మంగళవారం మహానంది మండలం ఎం.తిమ్మాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రశ్నలు, జవాబుల పత్రాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్పీ తిమ్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను దుర్భాషలాడుతున్న అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు జునీద్‌బాషా డిమాండ్ చేశారు. మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు తరగతులు బహిష్కరించి కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. అధ్యాపకుడిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ సుంకన్నకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఏ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షులు దినేష్ కుమార్, నాయకులు సాయి, తేజ, జగదీష్, వెంకటేష్, సుజాత, వర్ధన్, రాము తదితరులున్నారు.

విద్యార్థులను అభినందించిన శాప్‌చైర్మన్

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బేస్‌బాల్, క్రికెట్ పోటీలకు ఎంపికైన పట్టణంలోని గురురాజ పాఠశాల క్రీడాకారులను రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ చైర్మన్ రవి నాయుడు అభినందించారు. ఈ నెల 13న ఉమ్మడి కర్నూలు జిల్లా ఔట్‌డోర్ స్టేడియంలో జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి బేస్‌బాల్ పోటీల్లో డి.కరిముల్లా, కె.కృప, క్రికెట్ పోటీలో బి.ధరణి, బి.చంద్రకళ, ఎ.గగనశ్రీ, సుదీప్తి, సిగ్నద రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులను శాప్‌చైర్మన్ రవినాయుడు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యక్షులు పుల్లయ్య, డీపీరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్త నిర్ధారణ పరీక్షలు

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పీఎస్‌సీ అండ్ కేవీఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మొదటి సంవత్సరం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1, యూనిట్ 2 విద్యార్థులకు రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాల వైద్యురాలు దివ్య, టెక్నీషియన్ నర్సయ్య, ఏఎన్‌ఎం మేరి విద్యార్థినుల నుంచి రక్తనమూనాలు సేకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.శశికళ, ప్రోగ్రాం ఆఫీసర్ విజయానంద్, రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్

పాణ్యం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతిరాం పార్మసీ కళాశాల కెమిస్ట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ఎన్. యల్లాసుబ్బయ్యకు డాక్టరేట్ వచ్చింది. మంగళవారం సుబ్బయ్యను కళాశాల డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ మధుసూదన్ చెట్టి, అధ్యాపకులు అభినందించారు.

మహానందిలో ప్రముఖుల పూజలు

మహానంది, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు, ఏపీ బ్రహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి సుధీర్ ఆలయానికి రాగా ముఖ మంటపం వద్ద అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఉభయ ఆలయాల్లో ప్రత్యేక అభిషేకార్చనలు జరిపారు. కల్యాణ మంటపంలో వీరిని వేదపండితులు ఆశీర్వదించారు. అధికారులు సన్మానించి ప్రసాదం అందజేశారు.

పశువుల సంచారంపై చర్యలు తీసుకోవాలి

మహానంది, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మహానంది పరిసరాల్లో పశువుల సంచారంపై చర్యలు తీసుకోవాలని ఎస్‌డీపీఐ నాయకులు కోరారు. మంగళవారం ఎస్‌డీపీఐ నాయకులు ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా కమిటీ సభ్యులు కరిముల్లా, శ్రీశైలం అసెంబ్లీ కమిటీ సభ్యులు రఫీ, అబ్దుల్, సభ్యులు పాల్గొన్నారు.

భక్తురాలికి వెండి వస్తువు అప్పగింత

మహానంది, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మహానందీశ్వరుని దర్శనం కోసం వచ్చి ఆలయ పరిసరాల్లో జారవిడుచుకున్న వెండి వస్తువును భక్తులకు మంగళవారం దేవస్థానం ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య అప్పగించారు. ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

బాలికల చదువు భవిష్యత్తుకు వెలుగు

కొత్తపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సమాజంలో బాలికల చదువులు భవిష్యత్తుకు వెలుగులు అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని ముసలిమడుగు, శివపురం గ్రామాల్లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు హరిత, లక్ష్మిదేవి, నాగమణి, సునీత, రమాదేవి, అంకమ్మ, శిరీష పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

కొత్తపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని జడ్పీటీసీ సోముల సధాకర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే అధిక వర్షాలతో దిగుబడి తగ్గడంతో పాటు దళారుల దందా ఎక్కువైందన్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలని కోరారు.

క్యూఆర్ కోడ్‌తో మద్యం వివరాలు

నంద్యాల టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా బాటిల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చునని ఈఎస్ రవికుమార్ మంగళవారం ఓప్రకటనలో తెలిపారు. ఈ యాప్ ద్వారా కంపెనీ, ఎంఆర్‌పీ ధర నేరుగా వినియోదారుడే తెలుసుకోవచ్చునన్నారు. నకిలీ బీర్ల తయారీకి సులభం కానందున బీర్లను స్కాన్ చేయడానికి వీలుండదన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులతో పారదర్శకత


స్మార్ట్ కార్డును పంపిణీ చేస్తున్న ఫిరోజ్

నంద్యాల రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ రేషన్ కార్డులతో పారదర్శకత సాధ్యమని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 7వ వార్డులో స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో గఫార్, సద్దాం, ఉప్పరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలి

- మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సురేఖ


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గుండెపోటు వచ్చిన రోగికి మొదటి కొన్ని నిమిషాల్లోనే సీపీఆర్ అందించడం ద్వారా జీవించే అవకాశాలు రెండింతల నుంచి మూడింతల వరకు ఉంటుందని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సురేఖ అన్నారు. మంగళవారం నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల, జీజీహెచ్‌లో ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సీపీఆర్ అవగాహన వారోత్సవాలను నిర్వహించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎ.సురేఖ, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మదన్ మోహన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కార్డియో పల్మనరీ రెసిసికేషన్ (సీపీఆర్) అనేది గుండె ఆగిపోవడం లేదా శ్వాస ఆగిపోవడంవంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రాణ రక్షణకు అత్యంత కీలకమైన పద్ధతి అన్నారు. ప్రజలు సీపీ ఆర్‌పై అవగాహన పెం చుకొని నైపుణ్యాన్ని నేర్చుకుంటే మనిషి జీవితాన్ని కాపాడవచ్చన్నారు. ఈ వారోత్సవాల్లో హ్యాండ్ ఆన్ సీపీఆర్ శిక్షణా కార్యక్రమాలు, పోస్టర్ ప్రదర్శనలు, సీపీ ఆర్ అవగాహన ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ విజయకుమారి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ ఎం. మహమ్మద్ రఫీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ చార్జీ హెచ్ఓడీలు పాల్గొన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, ఆస్పత్రి సిబ్బంది సీపీ ఆర్ అవగాహనను విస్తరించేందుకు ప్రతిజ్ఞ చేశారు.

పట్టణాభివృద్ధే ధ్యేయంగా పని చేయండి

- వార్డుల్లో పనులను నిలిపివేస్తే డీఈలు బాధ్యత వహించాలి
- త్వరలో డివైడర్లు, సెంటర్ లైటింగ్ ఏర్పాటు
- నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య


పాల్గొన్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య


సమస్యలపై మాట్లాడుతున్న కౌన్సిలర్ జాకీర్

నందికొట్కూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా పట్టణాభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సూచించారు. మంగళవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గిత్తా జయసూర్య హాజరై మాట్లాడుతూ వార్డుల్లో జరుగుతున్న పనులను మధ్యలోనే నిలిపివేస్తే సంబంధిత డీఈ, ఏఈలు బాధ్యులవుతారన్నారు. పట్టణ ప్రధాన రహదారికి డివైడర్లు, సెంటర్ లైటింగ్ పనులకు రూ. 3 కోట్లు మంజూరు అయ్యాయని, త్వరలోనే పనులను ప్రారంభిస్తామన్నారు. నందికొట్కూరు నుంచి నంద్యాల వెళ్లే రహదారిని నిర్మించాలని చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ గార్గేయపురం నుంచి మిడ్తూరు వరకు, నందికొట్కూరు నుంచి మిడ్తూరు వరకు, నందికొట్కూరు నుంచి పగిడ్యాల వరకు బీటీ రోడ్డు అనుమతులు మంజూరు అయ్యాయన్నారు. రేపటి ప్రధానమంత్రి పర్యటనను నాయకులు, అధికారులు సమన్వయంతో జయప్రదం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. జంతు వధశాలను మార్చాలని పదేపదే అడుగుతున్నా స్థలాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు చూపిండం లేదని సభ దృష్టికి 2వ వార్డు కౌన్సిలర్ జాకీర్ తీసుకొచ్చారు. పట్టణంలో కుక్కల అధికంగా ఉన్నాయని, చిన్నపిల్లలు, మహిళలు కుక్కకాటు బారిన పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ వధశాల సమస్య మూడు రోజుల్లో పరిష్కారం కావాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బేబి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ఆకలి తీర్చే అక్షయపాత్ర

ఆకలితో ఉన్న ప్రతి ఒక్కరికీ అన్న క్యాంటీన్ అక్షయపాత్రగా నిలిచిందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మంగళవారం పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. భోజనం చేస్తున్న వారితో ఎమ్మెల్యే మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. క్యాంటీన్‌లో అందించే ఆహారం నాణ్యతగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ బేబి, వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్లు బాస్కర్‌రెడ్డి, జాకీర్ హూసేన్, ధర్మారెడ్డి, సొసైటీ చైర్మన్ ముర్తుజావళి, నాయకులు రజినీ కాంత్‌రెడ్డి, వడ్డె శ్రీనువాసులు, రాజు, మోహన్, సురేంద్ర, శ్రీను పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు గాయాలు

- పరామర్శించిన నాయకులు


బోల్తాపడ్డ వాహనాలు

గడివేముల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఏడుగురు వ్యవసాయ కూలీలు గాయపడ్డారు. ఈఘటన మండలంలోని పెసరవాయి గ్రామ సమీపంలో మంగళవారం ఉదయం చోటు చేసుకున్నది. వివరాలిలా.. పెద్దదేవలాపురం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు గడివేముల మండలం గని గ్రామంలోని వ్యవసాయ పనులకు ఆటోలో వెళ్తుండగా, పెద్దదేవలాపురం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు మిడ్తూరు మండలం బైరాపురం గ్రామానికి బోలెరో వాహనంలో బయలుదేరారు. పెసరవాయి గ్రామ సమీపంలో బోలెరో వాహనం డ్రైవర్ వెంకటరాముడు ఆటోను అధిమించేందుకు వేగంగా వెళ్లి అదుపుతప్పి ఆటోను ఢీకొన్నాడు. దీంతో ఆటో, బోలెరో వాహనం రోడ్డు పక్కన ఉన్న కేసీ కాలువలో పడిపోయాయి. వ్యవసాయ కూలీలు దస్తగిరమ్మ, బాలలక్ష్మమ్మ, మాధవి, కళావతి తీవ్రంగా గాయాపడ్డారు. మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలు కళావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బండిఆత్మకూరు మండలం బోధనం గ్రామానికి చెందిన వెంకటరాముడుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


గాయపడ్డ వ్యవసాయ కూలీలు

మెరుగైన వైద్యం అందించాలి

నంద్యాల రూరల్ : రోడ్డు ప్రమాదంలో గాయపడిన కూలీలకు మెరుగైన వైద్యం అందించి వారి కుటుంబాలను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్, ఉపాధి హామీ పీడీ గాయపడిన కూలీలను పరామర్శించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహనాయక్, సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాయకుల పరామర్శ

బండిఆత్మకూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని కేసీ కెనాల్ ప్రాజెక్టు అభివృద్ధి కమిటీ చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని పెద్దదేవళాపురం, భోజనం, మోత్కూరు గ్రామాల కూలీలు పనులకు గడివేముల మండలం గని గ్రామానికి వెళ్తూ ప్రమాదానికి గురయ్యాయి. 20 మందికి పైగా గాయాలపాలయ్యారు. నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆయన పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి బాధితుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కృష్ణనాయక్, ప్రసాద్ ఉన్నారు. అలాగే శ్రీశైలం వైసీపీనాయకుడు శిల్పా భువనేశ్వరరెడ్డి, పుల్లారెడ్డి, శివలింగం, విక్రమసింహానాయక్, వ్యకాస నాయకులు కుళాయిస్వామి, డేవిడ్ క్షతగాత్రులను పరామర్శించారు.

విభజన హామీలు అమలు చేయాలి

- సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో వేర్వేరుగా నిరసనలు



ఆత్మకూరులో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు



గోస్పాడులో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

ఆత్మకూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన సమయంలో చట్టబద్ధంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం నాయకులు రామ్‌నాయక్, మాబాషా డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడారు. వెనకబడిన రాయలసీమలో కడప ఉక్కు పరిశ్రమను స్థాపించి స్థానికులకు ఉపాధి కల్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని అన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని, కార్మికులకు ఇబ్బంది కలిగే 13గంటల పనిని 8గంటలకు తగ్గించాలని డిమాండ్ చేశారు. నాయకులు వీరన్న, సద్దాం, శివ, గణపతి పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

ప్రత్యేక హోదా విభజన హామీలను అమలు చేయాలని సీపీఐ నాయకుడు ప్రతాప్ డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ పర్యటనను వ్యతిరేకిస్తూ మంగళవారం ఆత్మకూరులోని గౌడు సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రతాప్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగు సార్లు ప్రధాని మోదీ రాష్ట్రానికి వచ్చినప్పటికీ ఎలాంటి ఫలితం లేదన్నారు. సిద్దేశ్వరం అలుగు నిర్మాణం, శ్రీశైలానికి రైల్వే ప్రాజెక్ట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు జునీద్‌బాషా, సురేష్, వెంకటశివుడు ఉన్నారు.

బండిఆత్మకూరులో ర్యాలీ..

బండిఆత్మకూరు : ఏపీకి విభజన సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీపీఎం నాయకులు రామచంద్రుడు, డేవిడ్, రాజు డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాకు వస్తున్న ప్రధాని నరేంద్రమోదీ విభజన హామీలను నెరవేర్చాలని నినాదాదలు చేస్తూ మంగళవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కుళాయిస్వామి, బాషా పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకొని నిరసన..

నందికొట్కూరు: దేశ ప్రధానమంత్రి మోదీ విభజన హామీలను అమలు చేసి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని వామపక్ష పార్టీ నాయకులు శ్రీనివాసులు పక్కీర్ సాహెబ్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం పటేల్ సెంటర్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో గో బ్యాక్ నరేంద్రమోదీ అంటూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. వామపక్ష నాయకులు ప్రసాద్, గోపాలకృష్ణ, ఉస్మాన్ భాషా, రంగమ్మ, ఉసేనమ్మ, జయ పాల్గొన్నారు.

మోదీ గో బ్యాక్

గోస్పాడు: సీపీఐ, సీపీఎంల ఆధ్వర్యంలో మోదీ గోబ్యాక్ అంటూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం గోస్పాడులో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి హరినాథ్, సహాయ కార్యదర్శి జిలాని బాష, సీపీఎం నాయకులు సురేష్, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ హరితకు వినతిపత్రం అందజేశారు.

అభివృద్ధిని విస్మరించిన మోదీ

నంద్యాల రూరల్: భారతదేశ అభివృద్ధిని ప్రధాని మోదీ విస్మరించారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన సీపీఎం కార్యాలయంలో మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వేసే టారిఫ్‌పై ప్రధాని మౌనం వీడాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజను తప్పుదోవ పట్టిస్తుందన్నారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో జీఎస్టీ ద్వారా వాటిల్లే నష్టాన్ని వివరిస్తామన్నారు. నాయకులు రమేష్‌కుమార్, నాగరాజు, యేసురత్నం, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

హిందువుల మనోభావాలు దెబ్బతీయొద్దు


రైల్వే అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎంపీ శబరి

నంద్యాల రూరల్/కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : హిందువుల మనోభావాలు దెబ్బ తీయొద్దని ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. రైల్వేస్టేషన్ సమీపంలో నవగ్రహాల మండపానికి ఏర్పాటు చేసిన రేకుల షెడ్‌ను రైల్వే ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు సోమవారం రాత్రి సిబ్బంది తొలగించారు. మంగళవారం రాష్ట్రీయ ధర్మ రక్షాదళ్ నంద్యాల పట్టణ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, చింతలపల్లి వాసు ఆ ప్రాంతానికి చేరుకుని అధికారులతో వాగ్విదానికి దిగారు. సమాచారం తెలుసుకున్న ఎంపీ బైరెడ్డి శబరి రైల్వే సిబ్బందికి ఫోన్ చేసి తొలగించిన రేకులషెడ్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దేవాలయాల జోలికి వెళ్లొదని కోరారు. ఎంపీ ఆదేశాల మేరకు రైల్వే అధికారులు అక్కడు నుంచి వెళ్లిపోవడంతో సమస్య సద్దుమణిగింది.

పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం చేయకండి


కడమలకాల్వలో చెత్త సంపదకేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో గాయత్రి

బండిఆత్మకూరు అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ ప్రతి రోజూ చేపట్టాలని ఎంపీడీవో గాయత్రి సూచించారు. మంగళవారం మండలంలోని కడమలకాల్వ గ్రామంలో చెత్త సేకరణ, చెత్త సంపద కేంద్రాలను ఎంపీడీవో పరిశీలించారు. అనంతరం సచివాలయానికి వెళ్లి రికార్డులను తనిఖీ చేశారు. నిర్లక్ష్యం వీడి సిబ్బంది విధులకు సకాలంలో హాజరుకావాలని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి రామచంద్రుడు పాల్గొన్నారు.

అగ్గి తెగులుతో అన్నదాత విలవిల


సోమయాజులపల్లెలో అగ్గి తెగులు సోకిన వరి పంట

బండిఆత్మకూరు అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): వరిపంటపై ఆశించి అగ్గి తెగులుతో అన్నదాతలు విలవిలలాడిపోతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఈ ఏడాది వరి పంటకు అగ్గి తెగులు, కుళ్లు తెగులు, దోమకాటు సోకడంతో క్రిమి సంహారక మందులు పిచికారి చేయలేక, తలపట్టుకుంటున్నారు. ఈ ఏడాది పెట్టుబడులు విపరీతంగా పెరగటానికి తోడు తెగుళ్ల విపరీతంగా సోకటంతో ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సూచనలు సలహాలు ఇవ్వాలని కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

పాములపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ నాగరవీంద్ర తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల కర్నూలులో అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన అండర్ 19 ఎస్‌జీఎఫ్ ఎంపికలో సాఫ్ట్‌బాల్‌లో జీవన్‌కుమార్, క్రికెట్‌లో జయంత్ ఆచారి, బాల్‌బ్యాడ్మింటన్‌లో ప్రణయ్, సందీప్, ప్రసన్నలక్ష్మి, త్రోబాల్‌లో ఈశ్వర్, అశోక్, క్యారమ్స్‌లో సంతోష్, షటిల్‌లో ప్రణయ్, సందీప్, ఈశ్వర్ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్ఠలు తేవాలని అన్నారు. విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ సాయిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

రైతులకు అవగాహన

వెలుగోడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : వరిసాగులో జీవ నియంత్రణ పద్ధతులు పాటించాలని సీనియర్ సైంటిస్ట్ ధనలక్ష్మి అన్నారు. మంగళవారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రం సబ్‌సెంటర్‌లో మండల రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైంటిస్ట్ ధనలక్ష్మి మాట్లాడుతూ భూసార పరీక్షలు, వరిసాగులో జీవ నియంత్రణ పద్ధతులు, సహజ వ్యవసాయం, బయో ఇన్పుట్స్ పద్ధతులపై అవగాహన కల్పించారు. సమావేశంలో సీనియర్ సైంటిస్ట్ వెంకటరమణ, సస్యరక్షణ సైంటిస్ట్ బాలరాజు, స్థానిక వ్యవసాయశాఖ అధికారి స్వాతి, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రధాని సభను విజయవంతం చేద్దాం

గోస్పాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభను విజయవంతం చేద్దామని ఏపీడీ ఇస్మాయిల్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, వెలుగు సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి గ్రామం నుంచి ఉపాధిహామీలో కూలీలను, పొదుపు మహిళలను, గ్రామాల్లోని ప్రజలను ప్రధాని మోదీ సభకు తీసుకురావాలని సూచించారు. ఎంపీడీవో అమానుల్లా మాట్లాడుతూ ప్రధాని బహిరంగ సభకు వచ్చేవారి పేర్లు, సెల్ నెంబర్లు తీసుకోవాలని వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. సమావేశంలో కేసీకెనాల్ ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షుడు కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, ఏపీవో గంగన్న, ఏపీఎం శ్రీనివాసులు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీకార్యదర్శులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు


డబ్బులను లెక్కిస్తున్న భక్తులు

నంద్యాల కల్చరల్, అక్టోబరు 14(ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని ఆంజనేయ కోదండరామ స్వామి దేవస్థానం హుండీని మంగళవారం లెక్కించగా రూ.4,01,809 ఆదాయం వచ్చినట్లు ఈవో వేణునాథరెడ్డి తెలిపారు. ఏడు మాసాల హుండీ ఆదాయం లెక్కించినట్లు వివరించారు. ఆలయ తనిఖీ అధికారి హరిచంద్రారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, బాలాజీ సేవా ట్రస్ట్ సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

అనుమతులు తప్పని సరి

మహానంది, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినం సందర్భంగా బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. అనుమతులు తీసుకున్న నిర్వాహకులు ఖాళీ ప్రదేశాల్లో మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేసుకొని విక్రయాలు జరపాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

మందుల దుకాణాల తనిఖీ



మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఔషధ అధికారి

డోన్ టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఈనెల 12వ తేదీన 'ప్రజల ప్రాణాలతో చెలగాటం' అన్న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఔషధ అధికారులు స్పందించారు. పట్టణంలోని 8 మందుల దుకాణాలను మంగళవారం కర్నూలు రూరల్ ఔషధ అధికారి ఎస్.జయరాముడు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మందుల షాపుల్లో ఎక్స్‌పైరీ డేట్ అయిన మందులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మందులను నాణ్యత పరిశీలనకై ల్యాబ్‌కు పంపేందుకు సేకరించామన్నారు. ఈ తనిఖీల్లో గుర్తించిన చట్ట ఉల్లంఘనపై లైసెన్సు అథారిటీ అయిన సహాయ సంచాలకుల వారికి పంపించామని తెలిపారు.

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం


శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు గువ్వల సుబ్బారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి మద్దిలేటి

కోవెలకుంట్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నాయకుడు, కోవెలకుంట్ల సొసైటీ చైర్మన్ గువ్వల సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం కోవెలకుంట్ల పట్టణంలోని మార్కెట్ యార్డు కార్యాలయంలో ఏడీఏ సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సబ్సిడీ శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా వ్యవసాయాధికారి మద్దిలేటి, కోవెలకుంట్ల మార్కెట్ యార్డు చైర్మన్ మధులత, వైస్ చైర్మన్ విష్ణుశేఖర్‌రెడ్డిలతో కలిసి గువ్వలసుబ్బారెడ్డి శనగ విత్తనాల పంపిణీని ప్రారంభించారు. అనంతరం రైతులకు శనగ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లింగాల సొసైటీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి, సౌదరిదిన్నె సుబ్బారెడ్డి, బిజినవేముల హుసేనయ్య, ఏవోలు సుధాకరరెడ్డి, నాగజ్యోతి మార్కెట్ యార్డు సెక్రటరీ బండి నారాయణ స్వామి, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి


సెమిస్టరు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈవోలు

చాగలమర్రి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల సూచించారు. మంగళవారం చాగలమర్రి ఎమ్మార్సీ కార్యాలయంలో సెమిస్టరు పుస్తకాలను ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఎంఈవోలు మాట్లాడుతూ మండలానికి 15,437 సెమిస్టరు పుస్తకాలు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు ఖాసీం, వెంకటనారాయణ పాల్గొన్నారు.

45వేల ఎకరాలకు సాగునీరు

చాగలమర్రి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలో టీజీపీ ఆయకట్టు కింద 49 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్లు టీజీపీ డీఈ వెంకటరమణ తెలిపారు. మంగళవారం టీజీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ టీజీపీ ప్రధాన కాలువలో 5 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుందని అన్నారు. టీజీపీ ప్రధాన కాలువ నుంచి కడప జిల్లా బ్రహ్మసాగర్‌కు 23 టీఎంసీల నీటిని పంపించామని అన్నారు.

నాసిరకం మందులు విక్రయిస్తే చర్యలు

రుద్రవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రైతులకు నాసిరకం మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో సుమతి హెచ్చరించారు. మంగళవారం రుద్రవరంలో పురుగు మందుల షాపులను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి షాపు యజమాని రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలన్నారు.

సభాస్థలికి సెల్‌ఫోన్ల అనుమతి లేదు

రుద్రవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ సభాస్థలికి సెల్‌ఫోన్ల అనుమతిలేదని ఏపీడీ సాంబశివరావు, ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. సభా ప్రాంతంలోకి సెల్‌ఫోన్లను తీసుకెళ్లడానికి ఉన్నతాధికారులు అనుమతించరని వెళ్లిన వారు వారి వాహనాల్లో మాత్రమే ఉంచుకోవాలని సూచించారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

దొర్నిపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు చెన్నకేశ్వరి తెలిపారు. ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు బాపట్ల జిల్లా రేపల్లెలో జరిగిన తైక్వాండో విభాగంలో 18 కేజిల విభాగంలో వంశీ బంగారు పతకం, 21 కేజిల విభాగంలో శివగౌతమ్ కాంస్య పతకం, 20 కేజీల విభాగంలో హస్సిక కాంస్య పతకం సాధించారన్నారు. అన్నారు. వీరు నాగాల్యాండ్ రాష్ట్రంలోని కొహిమాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని అన్నారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం చెన్నకేశ్వరి, పీఈటీ దేవేంద్ర, ఉపాధ్యాయులు చెన్నయ్య, రవిప్రకాష్, మల్లికార్జున, విశ్వనాథ్ రెడ్డి, రమణయ్య అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు..

రుద్రవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఇటీవల కర్నూలులో జరిగిన జిల్లాస్థాయి బేస్‌బాల్ పోటీల్లో రుద్రవరం ఆదర్శ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వర్‌రావు తెలిపారు. వీరిలో ద్వితీయ సంవత్సరం విద్యార్థిని బి.పూజిత, ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఎం.హృదయ భాను పతకాలను సాధించినట్లు ఆయన తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

భగవద్గీతను అనుసరించాలి

కొలిమిగుండ్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ పరమాత్ముడు ఉపదేశించిన భగవద్గీతను అనుసరిస్తే మనిషి జీవితం ధన్యమవుతుందని ఆధ్యాత్మిక వేత్త వైవీఎస్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బెలుం గ్రామంలో వెలసిన శ్రీకృష్ణ మందిరంలో బహుళాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా గీతా పారాయణం, ఆధ్యాతిక ప్రవచనాల కార్యక్రమం నిర్వహించారు.

18న మండల సర్వసభ్య సమావేశం

కొలిమిగుండ్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 18న మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ నాగవేణి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో ప్రసాదరెడ్డి మంగళవారం తెలిపారు. ఈసమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలన్నారు.

మోదీ పర్యటనను జయప్రదం చేయాలి

ప్రధాని పర్యటన కమిటీ కన్వీనర్ దామచర్ల జనార్దన్ రావు


మాట్లాడుతున్న దామచర్ల జనార్ధన్ రావు

డోన్ టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనను జయప్రదం చేయాలని ప్రధాని పర్యటన కమిటీ కన్వీనర్, ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ రావు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, డోన్ నియోజకవర్గ అబ్జర్వర్ కేసీ హరితో కలిసి ఆయన డోన్ నియోజకవర్గ కూటమి నాయకులు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలోని బేతంచెర్ల, డోన్, ప్యాపిలి మండలాల నుంచి దాదాపు 200 పైగా బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్సుల్లో 10వేల మందికి పైగా కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని క్లస్టర్ ఇన్‌చార్జిలను ఆదేశించారు. ప్రధాని రాకతో ఉమ్మడి జిల్లాకు భారీగా పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈసమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు టీఈ రాఘవేంద్రగౌడు, మండల అధ్యక్షుడు దశరథరామిరెడ్డి, ప్యాపిలి మండల అధ్యక్షుడు సుదర్శన్, ప్యాపిలి పట్టణ అధ్యక్షుడు బొమ్మనపల్లె మధు, బేతంచెర్ల మండల అధ్యక్షులు ఎల్ల నాగయ్య, పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, చంద్రపల్లె లక్ష్మీనారాయణ యాదవ్, బీజేపీ నాయకుడు సంధు వెంకటరమణ, బండి కిరణ్, రవి, దిలీప్ రెడ్డి, తోట మనోహర్, ఎంపీడీవో జి.వెంకటేశ్వరరెడ్డి, ఏపీవో సుకుర్ పాల్గొన్నారు.

మోదీ సభను విజయవంతం చేయండి: మంత్రి బీసీ

బనగానపల్లె: కర్నూలులో గురువారం జరిగే ప్రధాని నరేంద్రమోదీ సభను విజయ వంతం చేయాలని రోడ్లు, భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈసభకు బనగానపల్లె నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ జనసేన నేతలు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సభకు వచ్చే వారికి అవసరమైన బస్సు, భోజన సౌకర్యం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జీఎస్టీ తగ్గింపుతో కలిగే లాభాలను సభలో మోదీ వివరించనున్నట్లు తెలిపారు. నంద్యాల జిల్లాలోని శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున్ని కూడా మోదీ సందర్శించనున్నారన్నారు.

ఉయ్యాలవాడ: కర్నూలు పట్టణంలో జరిగే ప్రధాని నరేంద్రమోదీ సభను జయప్రదం చేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వరావు తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంటులు, ఫీల్డ్ అసిస్టెంటులు, వీవోఏలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలకు 30 బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో బస్సుకు ఒక ఇన్‌చార్జిని నియమించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీవో హరిక్రిష్ణ, సీసీ గంగన్న ఉన్నారు.

చాగలమర్రి: ఉమ్మడి కర్నూలు జిల్లాలో గురువారం ప్రధాని నరేంద్రమోదీ పర్యటనను విజయవంతం చేయాలని ఎంపీడీవో తాహిర్‌హుసేన్ కోరారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులచే సమావేశం నిర్వహించారు. ఏవో రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

రాయల్టీ సమస్యను పరిష్కరించండి


మాజీ ఎంపీపీకి వినతిప్రతం ఇస్తున్న మైన్స్ యజమానులు

బనగానపల్లె, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నాపరాళ్లకు, గోడలకు కట్టే వేస్టేజి రాళ్లకు కూడా రాయల్టీలు చెల్లించాలని బలవంతంగా వసూలు చేస్తున్నారని ఈసమస్యను పరిష్కరించాలని కోరుతూ టీడీపీ జిల్లా నాయకుడు, మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డికి పలువురు మైన్స్, ట్రాక్టర్ల యజమానులు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. మైన్స్ యజమానులు మాట్లాడుతూ రామకృష్ణాపురం, పలుకూరు, గోవిందిన్నె గ్రామాల్లో నాపరాయి పరిశ్రమపైనే వందలాది మంది కార్మికులు జీవనోపాధి పొందుతున్నారన్నారు. ఇటీవల అధికంగా రాయల్టీలు నాపరాళ్ళపై కాంట్రాక్టర్లు వసూలు చేస్తున్నారన్నారు. మైనింగ్, ట్రాక్టర్ల యజమానులు పలుకూరులో మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డిని కలిసి విన్నవించారు. విషయాన్ని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తామని అంబాల హామీ ఇచ్చారు.

పొగాకు సాగు నిషేధం

రుద్రవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బ్లాక్ బెర్లీ పొగాకు సాగుకు పూర్తిగా నిషేధించినట్లు ప్రభుత్వం జీవో జారీ చేసినట్లు ఏవో సుమతి మంగళవారం తెలిపారు. వైట్‌బెర్లీ పొగాకు సాగుకు కంపెనీలతో ఒప్పందం తీసుకునే రైతులు సాగు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.ఆర్‌టి 740 ప్రకారం 25, 26 నుండి హెచ్‌డి బీఆర్‌జీ / హెచ్‌డీ బెర్లీ బ్లాక్ బెర్లీ పొగాకు నిషేధించారు. వైట్ బెర్లీ పొగాకు సాగు నిబంధనలతో అమల్లో ఉంటుందన్నారు.

ప్రధాని మోదీ పర్యటనను వ్యతిరేకించండి

సీపీఎం, సీపీఐ నాయకుల నిరసన



బేతంచెర్లలో నిరసన తెలుపుతున్న సీపీఐ, సీపీఎం నాయకులు



బనగానపల్లె నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

బేతంచెర్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనను వ్యతిరేకిస్తూ బేతంచెర్ల పట్టణంలో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం మోదీ గో బ్యాక్ అంటూ నిరసన తెలిపారు. సీపీఎం నాయకులు రామాంజనేయులు, భార్గవ్, ఎల్లయ్య మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేకహోదా విభజన హామీలు అమలు చేయని ప్రధాని పర్యటనలు రాష్ట్రానికి ఏం ప్రయోజనమో చెప్పాలని ప్రశ్నించారు. జీఎస్టీ పేరుతో సామాన్యుడి నడ్డీ విరిచి రూ.55 లక్షల కోట్లు వసూలు చేశారని ఆరోపించారు. ఒకవైపు జీఎస్టీ భారం తగ్గించి.. ప్రతి ఇంటికి రూ.15వేలు మేలు చేశామని అసత్య ప్రచారం నిర్వహించడానికి వస్తున్న మోదీ పర్యటనను వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు తిరుమలేష్, ఉదయ్, ఎల్లకృష్ణ, మధు, బాలు, ప్రదీప్, ఖదీర్, గోర్లగుట్ట రవి, ఎస్‌కేకే బాషా, రామకృష్ణ, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, విష్ణు నారాయణ, రాజబాబు, రమణ నాగేశ్వరరావు శ్రీరాములు, సోమన్న, సాయితేజ పాల్గొన్నారు.

బనగానపల్లె: ప్రధాని నరేంద్రమోదీ ఉమ్మడి కర్నూలు జిల్లా రాకను నిరసిస్తూ మోదీ గోబ్యాక్ అంటూ సీపీఐ, సీపీఎం నాయకులు బనగానపల్లెలోని పెట్రోల్ బంకు కూడలిలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్ మాట్లాడుతూ మోదీ రాష్ట్రానికి ప్రత్యేకహోదా విభజన హామీలు, రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ప్రారంభం చేయాలని, సిద్దేశ్వరం అలుగు నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏడాది 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగలను మోసం చేశారన్నారు. సీపీఐ మండల కార్యదర్శి శివయ్య, సుబ్బారెడ్డి, సీపీఎం నాయకుడు సుబ్బయ్య పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మండల కేంద్రమైన కొలిమిగుండ్లలో సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ గో-బ్యాక్ అంటూ నిరసన తెలిపారు. రాయలసీమ ప్రత్యేక ప్యాకేజీ, కడప ఉక్కు పరిశ్రమ, సాగునీరు తదితర విషయాల్లో రాయలసీమకు తీవ్ర అన్యాయం చేసిన మోదీకి జిల్లాలో పర్యటించే అర్హతలేదన్నారు. సీపీఐ మండల కార్యదర్శి నూరి, మహేష్, పెద్దయ్య, నరసింహులు, సూర్యుడు పాల్గొన్నారు.





ప్యాపిలి, కొలిమిగుండ్లలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

ప్యాపిలి: ప్రధాని మోదీ ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనపై సీపీఐ, సీఐటీయూ వేర్వేరుగా మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ దగ్గర నిరసన వ్యక్తం చేశారు. మోదీ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు కె రాధాక్రిష్ణ, మహేష్, చిన్నరహిమాన్, రంగస్వామి, హమాలీ, ఆటో, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

వైద్యసేవలు బంద్

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్ల సమ్మెతో..
- గ్రామాలకు నిలిచిపోయిన 104 సేవలు



కొత్తబురుజు పీహెచ్‌సీలో నిలిచిపోయిన 104 వాహనం

డోన్ రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాలకు వైద్యసేవలు నిలిచిపోయాయి. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు తమ సమస్యల పరిష్కారం కోసం గత 15 రోజుల నుంచి సమ్మెలో ఉన్నారు. మండలంలో కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చిన్నమల్కాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. కొత్తబురుజు పీహెచ్‌సీ డాక్టర్లు సమ్మెలో ఉండటంతో 104 సేవలు నిలిచిపోయాయి. ఆరోగ్య కేంద్రం డాక్టర్లు సమ్మెలో ఉండి డ్యూటీలకు రాకపోవడంతో గ్రామాలకు 104 వాహన సేవలు నిలిచిపోయాయి. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సమయంలో గ్రామాలకు సంబంధించిన ఆరోగ్య కేంద్రం డాక్టర్లు సమ్మెలో ఉండటం ఆందోళన కలిగిస్తుంది.

ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి



డాక్టర్లు సమ్మెలో ఉండటంతో రోగులకు వైద్యసేవలు నిలిచిపోకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ల న్యాయపరమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలి. డాక్టర్లు విధుల్లో కి వచ్చేలా ప్రభుత్వం చొరవ చూపాలి.

- మోట రాముడు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, డోన్

పేట్నీకోట రహదారికి మోక్షం


రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలిమిగుండ్ల, పెట్నీకోట రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. గత కొన్నేళ్లుగా రోడ్డు శిథిలావస్థకు చేరుకొని, రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నా గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో నాయినిపల్లె, పేట్నీకోట గ్రామాల ప్రజలతోపాటు, కొండమీద గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంత్రి బీసీ ప్రత్యేక దృష్టి సారించి ఇటీవలే రూ.2కోట్ల నాబార్డు నిధులతో రహదారి నిర్మాణ పనులను పూర్తి చేశారు. గత వారం రోజులుగా కొనసాగిన రహదారి పనులు మంగళవారం పూర్తి కావడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి రాకపోకలు సాగించే వాహనదారులకు ప్రయాణం మరింత సులభతరం కానుంది.

ప్రజారోగ్య సంక్షేమమే లక్ష్యం


మాట్లాడుతున్న వైద్యశాఖ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి

చాగలమర్రి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య సంక్షేమమే ప్రభుత్వ లక్షమని వైద్యశాఖ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వాసవీ జూనియర్ కళాశాలలో ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ పథకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల, గుండె జబ్బుల గురించి వివరించారు. సీపీఆర్ గురించి విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సురేంద్రబాబు, కళాశాల ప్రిన్సిపాల్ ఓబులేసు, ఏఎన్‌ఎం గార్లేట్, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల మండలంలో భారీ వర్షం

కొలిమిగుండ్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని హనుమంతుగుండం, ఎర్రగుడి, నాగిశెట్టిపల్లె తదిర గ్రామాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. తిమ్మనాయినిపేట, నందిపాడు గ్రామాల్లో సైతం ఓ మోస్తరు వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి ప్రవహించగా, రైతులు సాగుచేసిన పలు పంట పొలాల్లో నీరుచేరాయి.

వర్షానికి తడిసిన పంట దిగుబడులు

ప్యాపిలి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట దిగుబడులు తడిసి ముద్దవుతున్నాయి. ప్రధానంగా ఆముదం, సజ్జ పంట దిగుబడులు వర్షాలకు పూర్తిగా తడవడంతో రైతులు రోడ్లపై వాటిని ఆరబెట్టుకుంటున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి చేతికొచ్చిన సజ్జ, ఆముదం పంటలు నాశనవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాల్మీకుల హామీని నెరవేర్చాలి

కొలిమిగుండ్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ అంశంపై ప్రధాని నరేంద్రమోదీ మౌనం వీడాలని వాల్మీకి రిజర్వేషన్ ప్రజాసమితి రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్‌గోపాల్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు కర్నూలులో పర్యటించిన మోదీ వాల్మీకులను ఎస్టీలో చేరుస్తామని హామీ ఇచ్చారన్నారు. 16న జిల్లాలో పర్యటిస్తున్న సందర్భంగా వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణపై మోదీ సానుకూలంగా స్పందించి స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. పెద్దయ్య, కంబగిరిస్వామి, రామూర్తి, సుధాకర్ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఉయ్యాలవాడ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జీఎస్టీ తగ్గింపుపై ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి స్థానిక బస్టాండ్ వరకు ర్యాలీ చేశారు. జీఎస్టీ సేవింగ్స్ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీవో హరిక్రిష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

బనగానపల్లె: నిత్యావసర వస్తువులు, ఎలక్ట్రానిక్ వస్తువులపై జీఎస్టీ తగ్గించారని బనగానపల్లెలో ఎంపీడీవో బాలాంజనేయులు, సూపరింటెండెంట్ నాగరాజు, గ్రామ పంచాయితీ ఈవో సతీశ్‌రెడ్డి అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని దుకాణదారులకు, ప్రజలకు జీఎస్టీ తగ్గింపుతో ప్రయోజనాలను అధికారులు వివరించారు.

తగ్గించిన జీఎస్టీ రేట్లకే వస్తువులు అమ్మాలి


జీఎస్టీ రేట్లను పరిశీలిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామక్రిష్ణారెడ్డి తదితరులు

కోవెలకుంట్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తగ్గించిన జీఎస్టీ రేట్లకే వస్తువులను షాపు యజమానులు వినియోగదారులకు అమ్మాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామక్రిష్ణారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని వివిధ షాపుల్లో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి గడ్డం రామక్రిష్ణరెడ్డి కోవెలకుంట్ల మండల టీడీపీ అధ్యక్షులు అమడాల మద్దిలేటి టీడీపీ నాయకులతో కలిసి జీఎస్టీ రేట్లను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించండి: ఏపీడీ


మాట్లాడుతున్న ఏపీడీ సాంబశివరావు

రుద్రవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి ఉపాధి కూలీకి ఈకేవైసీ చేయించాలని ఏపీడీ సాంబశివరావు అన్నారు. మంగళవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోవెలకుంట్ల క్లస్టరు పరిధిలో 8 మండలాల్లో ఈకేవైసీ కొనసాగుతుందన్నారు. లక్షా 12వేలు జాబ్‌కార్డులుండగా 96వేల జాబ్ కార్డులకు ఈకేవైసీ చేశామన్నారు. మండలంలో 65 శాతం ఈకే వైసీ పెండింగ్‌లో ఉందన్నారు. ఎంపీడీవో భాగ్యలక్ష్మి, ఏపీవో గౌరీబాయి, ఈసీ సుబ్బన్న పాల్గొన్నారు.

నకిలీ మద్యాన్ని గుర్తించేందుకు ప్రత్యేక యాప్

బనగానపల్లె, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం నాణ్యతను గుర్తించడానికి ప్రత్యేక యాప్‌ను రూపొందిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ సతీశ్, ఎస్ఐ కమలాకర్‌లు మంగళవారం తెలిపారు. బనగానపల్లె ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో వారు మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్ ప్రతి ఒక్కరు డౌన్‌లోడ్ చేసుకొని మద్యం బాటిల్‌ను స్కాన్ చేస్తే మద్యం బాటిల్ నాణ్యత తెలుసుకోవడానికి వీలుంటుందన్నారు. ప్రతి ఒక్కరు ప్లేస్టోర్ ద్వారా ఈయాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, అక్రమంగా మద్యం అమ్మితే 8008828467 , లేదా 9440902589 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

ఆయిల్‌ఫాం సాగుపై అవగాహన

కోవెలకుంట్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని సౌదరదిన్నె గ్రామంలో మంగళవారం ఆయిల్‌ఫాం పంట సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పతాంజలి ఫుడ్ లిమిటెడ్, ఉద్యానశాఖ నంద్యాల జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పతాంజలి కంపెనీ మేనేజరు రమణారెడ్డి, నిర్వహకురాలు రవళి పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. రమణారెడ్డి మాట్లాడుతూ ఆయిల్ ఫాం పంట సాగు చేసుకుంటే ప్రభుత్వమందించే సబ్సిడీ ప్రయోజనాల గురించి వివరించారు.